# సూద్రు బుచ్చిగాని బాగోతం

**రహమతుల్లా**



(గతవారం తరువాయి)

**ఇం**డ్లల్లో ఉంటె తలుపు లేసుకుంటరు. బైట్నుంటే ఉరుకు తుంటరు. ఒకటీ అరా మాటాడినా, కసురుకొనుడే.

ఒక్కసారు మాత్రం నవ్వులాటలాగ మాట్లాడేది.

'ఎవర్నువ్వు?' అనడిగేది.

'సూదరోడ్ని' అనేవాడు.

'అంటే?' అనేది

'చాకలోడ్ని' అనేవాడు.

'ఇంకా నువ్వేమిటి?' అనేవాడు.

'నాచమ్మ కొడుకుని'.

'ఇంకేమీ కాదా?' అనేవాడు.

'పోండి సారూ. మీకన్నీ పరాచికాలే. నాతాన ఇంకేముంటది? ఈ తోలు పెయ్యింటది. లోపటొక జీవుంటది. ఏదన్న తొర్ర నుంచి జీవి బైటపడ్డదంటె పెయ్యి కూడా మన్నవుద్ది' అనేవాడు.

'అంటే నువ్వు మట్టివా?' అనేవాడు.

ఇదంతా నాచమ్మ చూస్తంటది.

ఉండి ఉండీ 'ఊర్లో అయ్యా నీకన్నీ సిత్రమే. పెతీదీ వివరం గావాల. సతాయించి సంపుతవ్. వాడి పాణం బాగోలేక వాడు సస్తన్నడు. అర్థం పర్థంలేని బతుగ్గురించి వాడ్నెందుకు సింతలో ఏస్తవ్? ఎర్రిబాగులోడు. జీవితం ఎట్లుంటే అట్ల బతికేటోడు.

ఎటు నూక్కపోతే అటు పోయేవాడు. వాడి బతుకు వాడ్ని బతకనీరాదయ్యా'? అనేది

రోజూ బ్రహ్మంగారి కథ గొణుగుతా చదువుకుంటడు. రాగం తీస్త ఏవో కీర్తనలు పాడుకుంటడు. ఎన్ని వందల సార్లు ఆ పుస్తకం చదివిండో! ఎన్ని వేలసార్లు గా తత్వాలు పాడుకుండో!

ఒకదినం మంగలోని కాడికి బొచ్చుగొరిగించుకుందామని పోయిండు. తల్లి పుస్తకం అక్కడే మరిచిపోయింది. అప్పట్నుంచి వాళ్ళూరు పంతులు రాసిచ్చిన సిద్ధప్ప ఏషం ఒక నోటుబుక్కులో ఉండింది. అది చదువుకుంట, నోట్లోనోట్లో పాడుకుంట ఉంటడు.

ఒక ఆదివారం గా పరాచికాల సారు, ఇంజమూర్లున్న దర్గా ముచ్చట అడిగిండు.

బుచ్చిగా ఖుషీగా చెప్పసాగిండు.

** ** **

'అప్పట్ల మా ఊర్ల ఒక దొరసానమ్మ ఉండేది. ఆమె పటాపురం మస్తుగ సాగేది. మగోడు కూడ ఆమెకు ఎదురు చెప్పకపోయేది. ఎదురు మాట్లాడితే తుపాకితో కాల్చిపారేసేది. తుపాకి భుజాన వేసుకని కోట చుట్టూ తిరిగేది. మా ఊరి చాకలోళ్ళని దొంగతనానికి తోలేది. ఆమె పటా పురం అట్ల సాగేది. ఒకరాత్రి మా ఊరి చాకలోళ్ళని దొంగతనా నికి అంపింది. వాళ్ళు ఒకింటికి పోయినారంట. ఆ ఇంట్ల ఒక పెట్టె కనిపించిందట. మస్తు బరువున్నదంట. నలుగురు కలసి దాన్ని ఈడ్చుకొచ్చినారంట.

వెనకంగ ఒక రాయి దొర్లుకుంట వస్తున్నదంట. ఈ తిక్కనాకొడుకులకు తెలియక దాన్ని ఇసిరి కొడుతున్నరంట. అది మళ్ళీ మళ్ళీ దొర్లుకుంటు వస్తనే ఉందట.

అది మైసమ్మ తల్లని ఈ తిక్క మొహమోల్లకు ఇంకా తెలీకపోయిందంట. సచ్చిసెడి ఎంతో బరువున్న పెట్టెను మోసుకొచ్చి కోటలో ఎట్టి ఎల్లిపోయినారంట. రాత్రంత దాన్లోంచి ఏదో చప్పుడొస్తున్నదంట. దొరసానమ్మకు భయం వేసిందంట. ఉదయాన్నే చాకలోల్లని పిలిపించి ఈ పెట్టెని ఎక్కడ్నుంచి తెచ్చినారని అడిగిందంట.

'చుక్కల చుక్కల గోడలు ఉన్న ఇండ్లనుంచి తెచ్చినం' అన్నరంట. తురకోల్ల గోడలకు సున్నంతో చుక్కలు పెట్టెడిది. ఈ పెట్టెల తురక దేవుడున్నడు. దీన్ని దెంకపోయి మీ ఇండ్లలోనే పెట్టుకోమన్నదంట. దాన్ని దెంకోనొచ్చి వాళ్ళ పొలాల్లో ఉన్న చిన్న మర్రిచెట్టు పంగలో పెట్టినారంట.

పెట్టె, లోనికి పోయి పుట్ట పెరిగిందంట. మైసమ్మ రాయొచ్చి దాని ఎదురుంగనే కూర్చున్నదంట. పుట్టలోపట నాగేంద్రస్వామి కూడ ఉన్నదంట. ఆ పుట్టే దావుల్‌పీర్ల దర్గా ఐపోయింది. ఆ దేవునికి ఎన్నో శక్తులున్నయంట. ఎన్నో ఏళ్ళగ మర్రిమాను ఇంత ముసల్దయినా, ఇంకున్నదంటె ఆ సామి మహిమే. మా తాత వంటిమీనికి దావుల్‌పీర్ల దేవుడొచ్చెడిది. అలా పెయ్యి మీనికి ఒచ్చినప్పుడు ఏమనుకుంటె అది జరిగేది. ఒకసారి గాసామి పైకొచ్చినప్పుడు మా తాత చేతుల్ల గింత మన్ను పట్టుకొని ఖజూర పండ్లనుకుంటె గుప్పెడు ఖజూర పళ్ళు ఐనవంట.

కథ

వచ్చేటప్పుడు సీకటయిపోయింది. ఊరి పొలిమేర్ల కాడ రెండు పందిగూనలు పైనబడ్డయంట. దేవునికి దండమెట్టుకుని దావుల్‌సాబ్... ఇక నీవే దిక్కన్నడంట. అంతే, పుల్లగుర్రమ్మీద సామి పత్యక్షమయ్యిండంట. పందిగూనలు ఎటెల్లినయో.

దీన్...దీన్... అనుకుంట సేమంగ ఊర్ల పడ్డడంట.

అప్పట్ల అంత సత్‌పతి ఉండేది.

ఒకసారి పయనాలు తోలితే, గా పని చూసుకుని వస్తున్నడంట. గప్పుడు మధ్య ఊరిల పీర్ల గుండం కాల్తున్నదంట. సామి పైమీనికి వచ్చిండు. మట్టిపెండలు గుండంలో నూకుతుంటె, పగిడ సాంబ్రాణి

సువాసనలు వస్తున్నయంట. అక్కడ్నుంచి ఊరుకు వస్తున్నడంట. చెప్పులు ఎక్కడో ఊడిపడ్డయంట. చేతికర్ర ఎక్కడో జారి పడ్డదంట. నెత్తిమీది చెద్దరుమాలు ఎక్కడో పోయిందంట. భుజానేసుకున్న గొంగడి కిందెక్కడో జారిపోయిందంట. ఐనా, ఊర్లకు వచ్చిందాకా మా తాతకు ఏమీ తెల్వనే లేదంట. భక్తిపరవశంల మునిగిపోయిండంట. గట్ల మా ఊర్ల సానామంది సామిలో లీనమవుతుంటరు. నిమ్మల పడుతుంటరు. గా భక్తితోనే పుట్టిన పిల్లోల్లకు దావులమ్మలని, దావులయ్యలని పేర్లు ఎట్టుకుంటరు'?

ఎంతో అమాయకత్వంతోని, ఎంతో శ్రద్ధతోని సుదీర్ఘంగా చెప్పడం ముగించాడు.

అపార్టుమెంటు సారుకు బుచ్చయ్యది అమాయకత్వమో, లేదా మనిషన్నవాడికి కావాల్సిన నిజమైన జ్ఞానము అదో అర్థం కాక బుర్ర గోక్కున్నడు.

** ** **

ఒకనాడు పొద్దున్నే నాచమ్మ పచ్చగడ్డి అవసరమై మురికి మూసీ నదొడ్డుకు ఎళ్ళింది. ప్రవహించే నీరులేక, కదలని బురదతో కంపు గొడ్తుంది. అయినా నాచమ్మకు ఆ వాసన, వాతావరణం ఇష్టమని పించాయి. ఏపుగా పెరిగిన పచ్చగడ్డి మధ్యనున్న ఓ పొదముందు కూర్చున్నది. బాధగున్నప్పుడు శోకండాల్తో భగమంతునికి చెప్తుంటది...

'ఓ దేవుడా... దావుల్‌సాబో... నేను సామీ... నాచమ్మని సామీ... నేను దుఃఖంలో ఉన్నా తండ్రో... నన్ను కష్టాల్నుంచి కడదేర్చయ్యా... నా బిడ్డ పాణం బాగోలేదు దావుల్‌సాబో... నువ్వే నయం చేయాలా తండ్రో...

పెయ్యంతా పుండ్లుపుండ్లు అయితాంది సాబో...
తోలంతా రగతం రగతం అయితాంది తండ్రో
గింతలోకే నున్నగా తెల్లంగైపోతాంది సాబో...
పక్కమీనంతా చేపపొట్టులా రాల్తంది సామో...
కందుర్లిచ్చే కర్రావు మాదిరి కర్రంగైండు తండ్రో...
బీడీలొద్దంటే వింటంలేదు సామో...
వాడయ్య మాదిరి మొండి భాడ్‌ఖావ్ అయిండు తండ్రో...
వాడ్ని చూస్తనే భయమౌతాంది సాబో...
జనం దూరంగ నూక్కపోతున్నరు తండ్రో...
వాడి కొలువుంటదో ఊడ్తదో తెల్వదు సామో...
ఈ సెర సాలదన్నట్టు ఫిట్ల రోగమొచ్చింది తండ్రో
యాడబడితే ఆడ ఎప్పుడు బడితె అప్పుడు కిందబడి
లట్టలట్ట కొట్టుకుంటున్నడు సామో...
బయటికి అంపాలంటేనే భయమవుతాంది తండ్రో
ఊరికెళ్ళి కంట్రోలు బియ్యం ఎవ్వడు తేవాలా
సామో...
వీడితోని ఒక గోస కాకపోయెనే తండ్రో
మాడరోగం పోయిందనుకుంటే గీ
కింకిర్లు తగులుకున్నయ్ సామో...
ఈ ముసల్దాని మీద దయుంచు
తండ్రో
డబ్బుంటే యాటనే కోస్త... లేదంటే
సప్ప కందూరన్న చేస్త దావుల్‌సాబో...
నీ కాల్మొక్త తండ్రో... నీ బాంచెన్
సామో...
పట్నం ఎల్లొచ్చినంక పది
గంథాలెల్లినయి దావుల్‌సాబో
నీ జాతరకు బుచ్చిగాని ప్రాణం విలవిల
కొట్టుకుంటది తండ్రో...
సార్లు వద్దంటే వద్దంటరు సాబో...
చేతుల పైసలుకూడా ఉంటం లేదు తండ్రో...
ఈసారి పండక్కు ఎట్లయిన వస్తం
దావుల్‌సాబో...

**అది మైసమ్మ తల్లని ఈ తిక్క మొహమోల్లకు ఇంకా తెలీకపోయిం దంట. సచ్చిసెడి ఎంతో బరువున్న పెట్టెను మోసుకొచ్చి కోటలో ఎట్టి ఎల్లిపోయినారంట. రాత్రంత దాన్లోంచి ఏదో చప్పుడొస్తున్నదంట. దొరసానమ్మకు భయం వేసిందంట. ఉదయాన్నే చాకలోల్లని పిలిపించి ఈ పెట్టెని ఎక్కడ్నుంచి తెచ్చినారని అడిగిందంట.**

మగదిక్కు లేనోల్లం... వాన్నెట్టయిన కాపాడు తండ్రో...'

గుండెలు పగిలేలా రొమ్ములు బాదుకుంట ఏడ్చింది. కన్నీల్లు ధారాపాతంగా కారినయ్. బాధంతా చేత్తోబట్టి లాగి బయటకు నూకినట్టయింది. పొదనే దేముడనుకుంది. మొక్కింది. అంతా అయ్యాక గా పొదను, చుట్టూతున్న పచ్చగడ్డిని కోసి మూటగట్టుకుంది.

** ** **

గంధం నాడు పొద్దున్నే ఇంట్ల అందరూ నెత్తి కోసుకున్నరు.

బుచ్చయ్య దబ్బదబ్బ గిన్ని నీళ్ళను నెత్తిమీదికెళ్ళి కుమ్మరించుకుని, తానం అయిందనిపించి, మాంసం కొరకు ఉరికిండు. ఆడోల్లు వంట షురూ చేసిన్రు. బుచ్చయ్య వహీద్ కటికాయన కాడ ఒక సప్ప మూడువందలకు తెచ్చిండు. పదిహేను రూపాయల్తో ఆకుపచ్చరంగుల ఉన్న జెండా బట్టకొన్నడు బొంగుకు రంగు కాగితాలు అతికించి జండా చేసిన్రు. ఏడుసేర్ల అన్నం, అందులో రెండు సేర్ల బగారా వండిన్రు. టమాటాలు తునకలు కలిపి ఒకటి, గోంగూర బోటి కలిపి ఇంకోటి రెండు కూరలు చేసినారు. మలీదా ముద్దలు పిసికినారు. రెండు కంచాల్లో అవన్నీ సదిరినారు. బట్టకప్పి ఇంటి నుంచి దర్గా కాడకు బయలుదేరినారు. బుచ్చయ్య ఇస్త్రీ చొక్కా వేసిండు. తెల్లధోతి కట్టిండు. నెత్తికి చెద్దరుమాలు చుట్టిండు. వేరే ఇంకో ముగ్గురు కందూరు వాళ్ళను



కలువుకుని మంగలోల్ల బ్యాండు నెత్తికి నభైకి మాట్లాడుకున్నరు. ఆడుకుంట ఎగురుకుంట ఊరేగింపు సాగింది. బుచ్చయ్య జాండ, పిల్లోల్లు కంచాలు పట్టుకుని చప్పుని తోటి దర్గాకాడికి ఎళ్ళి పాయితాలు ఎక్కించినారు. ముల్లోలు పాయితాలు చదివి, ఒక కంచం వాళ్ళు తీసుకున్నరు. రెండో కంచం వీళ్ళకు ఇచ్చేసినారు. దావుల్‌పేర్ల చాక లోల్లవే. దౌలత్‌సాహెబ్ దేవుడూ వాల్లోడే. అందు కని ముల్లోల్లు సాకలోల్ల దగ్గర డబ్బులడుగరు. వీళ్ళెంతిస్తే అంతే. దావుల్‌సాబుకు సలాములు చేసి కణతలకు ఊదు రాయించుకుని, ముదుపులు చెల్లించినారు. దర్గ గుడి ఎదురుంగ ఉన్న మైసమ్మ తల్లికి బెల్లంబువ్వ నైవేద్యం బెట్టినరు. నుదుట్ల కుంకుంబొట్టు ఎట్టుకున్నరు. జరంత అసంటున్న గౌండ్లోళ్ల ఈదెమ్మకు, వాళ్ళ కులం దేవుడు మదేలయ్యకు దండాలెట్టుకున్నరు. మఱ్రిమాను నీడన పడ్డ దుకాణాల్లో అవీ ఇవీ కొన్నరు. పుట్నాలు, బొంగులు, బత్తీసులు కొని తినుకుంట ఆ జాతర్ల తిరిగినరు.

మేమెటూ గా సీక్కు చుట్టిన పాత బట్ట ఆరకుండా గింత గ్యాస్ నూనె చుక్క వేసుకుంటూ, దిగిటీలు పట్టుకొని రాత్రంతా గంధం ఎంట ఉండాల్సిందే. మాకందరికీ గారాత్రి మొత్తం సంబరం సంబరం గదూ. సర్పంచో, ఎవరో ఒకరు గింత మందు పోపిస్తరు.

'కులము కులమని మాటామాటికి
కల్వరము పందించెదారూ
కులముతో పనిలేదు మనకు
ఎందుకూ వాదామెందుకూ అన్నయ్యలార'

మనస్సులోపట సిద్ధయ్య తత్వం పాడుకుంట బుచ్చయ్య, గుండెల్నిండిన భక్తి నింపుకుని మిగిలినోళ్ళు ఇంటికి ఎల్లొచ్చినారు.

పాతియాలు ఎక్కించిన బగారా బువ్వ వొండుకున్న మొత్తం అన్నంతో కలిపినారు.

అప్పటికి పొద్దుగాల మూడయ్యింది. అప్పటిదంక అందరికీ అందరూ ఉపాసమున్నరు. గప్పుడు బువ్వను కండ్లకద్దుకుని సుష్టుగ తిన్నరు.

'అవునే, గుడ్డిదాన. దేవునప్పుడు మస్తుగొండుతవ్.


ఇంటికాడేమైతదే నీకు?' నాచమ్మ సోడాబుడ్డి కళ్లద్దాలవైపు చూస్తూ ఉడికించేట్లు బుచ్చయ్యన్నడు.

అన్నం తినేసి ఒంటికాలి మీద నిలబడి తృప్తిగా అందర్నీ చూసుకుంటున్నది. మోకాలెత్తు చీర కడ్తది. ముఖం ఎన్నెన్నో అనుభవాల మూటలెక్కుంటది. దినంల ఎక్కువ సమయం మునీస్వరుడిలా ఒంటికాలిమీదే నిలబడ్తది. ఆమెనెరిగిన అందరికీ, అదో చిత్రం. కొంగ మాదిరి ఎంతసేపయినా నిలబడగలదు.

'నోర్మూసుకుని తినరా, కుంటి భాడ్‌ఖావ్. జీవితమంతా ఒండింది ఏ నాబట్ట దెంగితిన్నడో. కాపోల్లకాడ అడక్కొచ్చిన బువ్వగుల్ల నాకేదేకుక్కో? అపార్టుమెంట్ల అమ్మలిచ్చేదీ నీకే ఎడ్తుంటిని గదరా? నేనొండే బగోన్లు, బగోన్లు రుచిలేందే ఒడుస్తున్నయ్‌రా? ఒక్కనాడన్నా, నన్ను కడుపునిండ తిన్నిచ్చావురా? నా నోరెందుకు తెరిపిస్తవ్‌రా... కుక్క భాడుఖావ్...'

తిట్లందుకుంది నాచమ్మ.

తల్లీకొడుకులు తమాషా తమాషాగా తిట్టుకుంటరు.



మాట్లాడుకుంటరు. సాయంత్రానికి నాచమ్మ నాలుగైదు లొట్టీల కల్లు తెప్పించింది. అందరూ మంచిగ కలిసి తాగిన్రు. రాత్రికి మగాల్లు చెరి పావుసేరంత గుడుంబా, ఆడోళ్ళు పిల్లలు థమ్సప్ సీసాలు తాగిన్రు. పొద్దున్నే లేచి పట్నం బైలుదేరి ఎల్లొచ్చినారు.

** ** **

'ఏం బుచ్చయ్యా! ఖుషీఖుషీగా కన్పిస్తన్నవ్? తురుకోల్ల పండగ బాగా చేసొచ్చినట్లున్నవ్‌గా...' రాత్రికి గా పరాచికాల సారు అడిగిండు.

'గది తురుకోల్ల పండుగ ఎట్లయితది సారూ, మా ఊర్ల అందరి పండగ అది. అయినా, తురుకోల్ల ఒక్కళ్ళ వల్ల ఏమవుద్ది సారూ... ఊర్లల్ల వాళ్లెంతమంది ఉంటరని? ఏ ఊర్లయినా, ఇరవై ముప్పయి కుటుంబాలుంటయేమో... అయినా మా చుట్టుపక్కలున్న ఊర్లల్ల తురక జాతర్లు జోర్‌దార్‌గా జరుగుతాయ్. ఈ సీజన్ రాంగనే కుర్రంపల్లి మహబూబ్‌సామితో షురూ. అక్కడెట్టిన దుకాణాలే అన్ని చోట్లకు తిరుగుతుంటయ్. అరకపల్లి బిక్‌సావ్ తరువాత, మా దావుల్‌పేర్లు, చివర్న అబ్బాసావు మల్లేపల్లిలో అబ్బాసావు సామి. ఇక్కడ గా రాత్రంతా బగారన్నం పెడ్తనే ఉంటరు. ముక్కలు కూడ ఏస్తరు. ఎంతమంది తిన్నా, అస్సలికే ఒడవదు సారూ... ఆ సామిది ఏం మహిమో ఏందో గానీ... ఆంధ్రోల్లు వచ్చి చేస్తరది.

ఏ ఊర్లయిన మా సూదరోల్లు ముందుపడి చేస్తేనే జాతర ముందర పడ్తది. కొమ్మోని దగ్గర్నించి మాదాక అందరం పన్లు చేస్తం. కొమ్మోల్లు వూccc...అని భుజానికి వేలాడే కొమ్మూదాల్సిందే... గంట గంటకూ.

మాదిగోల్లు డప్పులూ, మంగలోళ్ళు బ్యాండ్లు, మాలోళ్ళు సన్నాయిలూ వాయించాల్సిందే.

మేమెటూ గా సీక్కు చుట్టిన పాత బట్ట ఆరకుండా గింత గ్యాస్ నూనె చుక్క వేసుకుంటూ, దిగిటీలు పట్టుకొని రాత్రంతా గంధం ఎంట ఉండాల్సిందే. మాకందరికీ గారాత్రి మొత్తం సంబరం సంబరం గదూ. సర్పంచో, ఎవరో ఒకరు గింత మందు పోపిస్తరు. ఎగురుకుంట, పరాచికాలాడుకుంట, మా పన్లు చూసుకుంట తెల్లారగట్ట దర్గకాడికి గంధం చేరుస్తం. ఆరాత్రంతా మాఊర్ల పిచ్చుకూడా నిద్రపోదు.

అస్సల్... నేనయితే ఆ ఒక్కదినం కోసం సమత్సరమంతా బతుకుతుంట. గీ పట్నం ముండ నూక్కొనొచ్చి ఒక్కేటుతో నన్ను చంపింది.

ఛ... నీయమ్మ... ఏం బతుకు గీ పట్నం బతుకు.

పీనుగులెక్కుంటది.

** ** **

బుచ్చిగానికి ఏ సుస్తీ లేకుంట సాఫీగ ఓ మూడేండ్లు గడిచింది. తోలు బీమారీ మళ్ళీ తిరగబెట్టింది. దాంతోపాటు అప్పుడప్పుడు తిక్కలేస్తదో ఏమో, మతి లేని పన్లు చేస్తుంటడు. ఫిట్ల రోగం కూడా తరచుగా వస్తనే ఉంది. పరేశానీ తిరిగి నాచమ్మను చుట్టుకుంది. ఊర్ల ఉన్నప్పుడు పడ్డ మాదిరి కన్పించేటోడు, గిప్పుడు పీరుకట్టె మాదిరి అగుపిస్తన్నడు. వాడ్ని చూస్తనే నాచమ్మకు ఏడుపు తన్నకొస్తాంది. వశపట్టంలా. కాలం దొర్లుతనే ఉంది. బుచ్చిగానికి తగ్గుతనే లేదు. రాన్రాను ఇంక ఇంక దగ్గరకైతండు.

'ఎంత మందిని మొక్కిన... అయినా వాని రోగం తగ్గుత లేదాయె... దేవుడు దెయ్యం అంతుత్తిదే... మంత్రాల్లేవ్ వరాల్లేవ్...

బతుకుంది... సచ్చిందాక బతక్క తప్పదు...

సెరుంటది.... అనుభగించాల్సిందే...

రవంతసేపు నిమ్మలానికే, జరంత శాంతానికే గీ దేవతల సింతన. భగమంతుడే లేడనుకుందాం... మాసంటోల్లమి ఏ అధరువుతో బతకాల. నుయ్యిలో దునికి చావాల.

అస్సలుకయితే, దేహంలోనే దేవుడుండు. పన్నెండు యాత్రలు మనలోపట్నే ఉన్నయ్'. నాచమ్మ పొంతనే లేని సింతన చేసుకుంటంది. ఇద్గిదే బతుకని, బతుక్కు మాత్రం ఒక్కటే సింతనంటూ ఏముంటది.